క్లుప్తంగా

నిరాశ్రయులకు ఆశ్రయం



బుచ్చిరాజుపాలెం షెల్టర్‌లో చేరిన నిరాశ్రయులతో మేనేజర్ మమత

గోపాలపట్నం: ఫుట్‌పాత్‌లపై ఉన్న నిరాశ్రయులకు బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ నైట్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నలుగురు నిరాశ్రయులకు మంగళవారం పోలీసుల సాయంతో షెల్టర్ మేనేజర్ మమత ఆశ్రయం కల్పించారు. ఇక్కడి వసతి గృహంలో వీరికి అన్ని సదుపాయాలు కల్పించనున్నట్టు తెలిపారు.

బాల నటుడు అరుణ్ దేవ్‌కు సత్కారం



బాలనటుడు అరుణ్ దేవ్‌ను సత్కరిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: బాలనటుడు అరుణ్ దేవ్‌ను మంగళవారం గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు ఘనంగా సత్కరించారు. 35 సినిమాల్లో అరుణ్ దేవ్ ప్రధాన పాత్రలు పోషించి అందరినీ మెప్పించాడని కళాపీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు అన్నారు. నాయుడు తోట రవినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జాకబ్‌రాజ్, గొరకల రామదాసు, చందు సుబ్బారావు, టి. రామారావు, నూకరాజేశ్వరరావు, టి. రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ పట్టినరోజు



ఎన్‌ఏడీ జంక్షన్‌లో పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ఎన్‌ఏడీ జంక్షన్‌లో పేదలకు బీజేపీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానిగా నరేంద్ర మోదీ దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖ రిటైర్డ్ ఉద్యోగుల విరాళం



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న రిజిస్ట్రేషన్ రిటైర్డ్ ఉద్యోగులు

విశాఖ సిటీ: ముఖ్యమంత్రి సహాయ నిధికి రిజిస్ట్రేషన్ శాఖ రిటైర్డ్ ఉద్యోగులు రూ.70 వేలు విరాళం అందించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి దామోదరరావు, కోశాధికారి త్రినాథరావు, సభ్యులు మురళి, శివరావు, జగదీష్, బాబ్జి, పోతురాజు, గురురాజు జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్‌ను కలిసి మంగళవారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ప్పటికీ.. సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న వారిని అభినందించారు.





ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ దిగువ రోడ్డులో ఇరుక్కు పోయిన లారీలు (ఫైల్)

ఆ జంక్షన్‌లో టెన్షన్..!

- ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ దిగువ రోడ్డులో హైట్ బారియర్స్ లేక ఇబ్బందులు
- నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు



గోపాలపట్నం నుంచి వచ్చే రోడ్డులో హైట్ బారియర్స్ లేని దృశ్యం



కరాసా వద్ద సైన్ బోర్డు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

గోపాలపట్నం: అధికారుల నిర్లక్ష్యంతో నిత్యం ఎన్‌ఏడీ మీదుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ దిగువ రోడ్డులో ఇరుక్కు పోతున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసర పనులపై వచ్చే వాహనదారులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. గతంలో పలు మార్లు భారీ వాహనాలు దిగువ రోడ్డులోకి రావడంతో ఫ్లైఓవర్, ఫుట్‌ఓవర్ దెబ్బతింది. దాన్ని మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. అలాగే మరో భారీ వాహనం వల్ల ఫుట్ ఓవర్ వంతెనపై వేసిన పలకలు దెబ్బతిన్నాయి. జాతీయ రహదారిపై హైట్ బారియర్స్ ఉన్నాయి. కాని మర్రిపాలెం నుంచి ఎన్‌ఏడీకి వచ్చే రోడ్డులో, గోపాలపట్నం నుంచి ఎన్‌ఏడీ వెళ్లే రోడ్డులో హైట్ బారియర్స్ లేవు. గతంలో ఉన్నా భారీ వాహనాలు ఢీకొట్టడంతో వాటిని తొలగించారు. గోపాలపట్నం నుంచి వచ్చే వాహనాలు బాజీ జంక్షన్ వద్ద సైడ్ రోడ్డులోకి మళ్లాల్సి ఉంటుంది. కొత్తగా వచ్చే భారీ వాహన డ్రైవర్లకు ఇది తెలియక సర్వీస్ రోడ్డులోనుంచి వెళ్లిపోతున్నారు. దీంతో ఫ్లై ఓవర్ వద్దకు వచ్చేసరికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వాహనాలు ఇరుక్కుపోతుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది.

ఆలోచన లేకుండా నిర్మించారు



ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో ఇబ్బందులను గుర్తించాల్సింది. భారీ వాహనాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల్సింది. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈ ప్రాంతంలో వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిజీగా ఉండే రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో గంటల కొద్దీ ఇతర వాహనాలు నిలిచి పోతున్నాయి.

– కంచపాటి వెంకటరమణ, బుచ్చిరాజు పాలెం

నిత్యం ఇబ్బందులే..



హైట్ బారియర్స్ లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. బాజీ జంక్షన్ సెంటర్ రోడ్డులోకి వెళ్లాల్సిన భారీ వాహనాలు ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ దిగువ రోడ్డులో వస్తుంటాయి. లారీలు, టూరిస్ట్ బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు గంటల సమయం పడుతుంది. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలి.

– దుంగ వెంకటరావు, ఎన్‌ఏడీ ఇందిరాప్రియదర్శి కాలనీ

గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు



గణనాథుడిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు



ప్రకాష్‌నగర్‌లో పూజల్లో పాల్గొన్న బద్రీనాథ్, రాము తదితరులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో నెలకొల్పిన పలు వినాయక మండపాల వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 60వ వార్డు శ్రీహరిపురం లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి ఉత్సవమూర్తిని భక్తులు, ఆలయ అర్చకులు పల్లకీలో శ్రీహరిపురం పుర వీధుల్లో అంగ రంగ వైభవంగా ఊరేగించారు.

- ప్రకాష్‌నగర్ వద్ద జరిగిన వినాయకుని పూజల్లో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు కలిదండి బద్రీనాథ్, వైఎస్సార్ సీపీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి (రాము),నగర కార్యదర్శి పీలా అనంత్‌కుమార్,దాసరి రవి పాల్గొన్నారు.
- ఇదే వార్డు గుల్లలపాలెం మార్కెట్ వద్ద మార్కెట్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో సాయి బాబా ఆలయ ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

కార్లతో ఉడాయించిన దంపతులకు రిమాండ్

- నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ తుహిన్ సిన్హా
- కొద్ది రోజుల్లో మరో రెండు కార్లు స్వాధీనం చేసుకోనున్నట్టు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ తుహిన్ సిన్హా

అగనంపూడి: కార్లను అద్దెకు తీసుకొని వాటిని తాకట్టు పెట్టి ఉడాయించిన దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నగర డీసీపీ తుహిన్ సిన్హా చెప్పారు. వారి నుంచి రెండు కార్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దువ్వాడ పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్న బుద్ధా వీర మణికంఠ కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్నాడు. అతను కారు కొని ఖాళీ సమయంలో అద్దెకు తిప్పుతున్నాడు. రుణంపై కారు తీసుకున్న మణికంఠ సకాలంలో ఈఎంఐలు చెల్లించలేకపోవడంతో దాన్ని అమ్మేసి రుణం తీర్చాలని భావించాడు. ఈక్రమంలో ఓఎల్‌ఎక్స్ యాప్ ద్వారా కారు అమ్మకానికి పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న మల్కాపురానికి చెందిన దంపతులు ఎరుపల్లి రవీంద్ర, రూపాశ్రీ వీరమణికంఠను కలిశారని డీసీపీ వెల్లడించారు. కారు తమకు అద్దెకు ఇస్తే నెలవారీ రూ.35వేలు అద్దె చెల్లిస్తామని నమ్మబలికారు. ఇది నమ్మిన మణికంఠ వారికి అద్దెకు ఇచ్చాడని తెలిపారు. మొదటి నెల అద్దె చెల్లించారు. తర్వాత నుంచి అద్దె చెల్లించకపోవడంతో పాటు ఫోన్‌కు అందుబాటులో లేకపోవడంతో బాధితుడు ఈ నెల 14న దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. పోలీసులు జీపీఎస్ ద్వారా ట్రాక్ చేసి కారు ఆచూకీ తెలుసుకున్నారు. కాగా కారును అప్పటికే రెండున్నర లక్షలకు ఒక వడ్డీ వ్యాపారి వద్ద తాకట్టు పెట్టినట్టు గుర్తించారు. మణికంఠ కారుతో పాటు మరో కారు స్వాధీనం చేసుకొని నిందితులిద్దర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన చెప్పారు. కొద్ది రోజుల్లో మరో రెండు కార్లను స్వాధీనం చేసుకోనున్నామని డీసీపీ వెల్లడించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోసిపోయిన సీతమ్మధార రైతుబజార్

సందర్శించిన మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్



రైతులు, వినియోగాదారులు లేక బోసిపోయిన సీతమ్మధార రైతుబజార్

సీతమ్మధార : రైతులు, వినియోగదారులు లేక సీతమ్మధార రైతుబజారు బోసిపోయింది. బజారుకు నాలుగేళ్లుగా కొనసాగిస్తున్న మంగళవారం సెలవుని జిల్లా అధికారులు రద్దు చేసి... రైతుబజార్ మంగళవారం యథావిధిగా పనిచేస్తుందని ప్రకటించారు. అయితే 2020 సంవత్సరం నుంచి అమలు చేస్తున్న సెలవును కొనసాగించాలని రైతులు కోరారు. రైతుబజార్‌కు ప్రతీ మంగళవారం సెలవు పాటించడంతో రైతులు, సిబ్బంది, వ్యాపారులు సొంత పనులు చేసుకునేవారు. ఈ నేపథ్యంలో ఆ సెలవు రద్దు చేయడంతో సీతమ్మధార రైతుబజార్‌కు పది మంది రైతులు మాత్రమే మంగళవారం వచ్చారు. ఉదయం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యాసిన్ రైతుబజార్‌ని సందర్శించారు. రైతులు లేకపోవడంతో కొద్ది సేపు ఎస్టేట్ ఆఫీసర్ కొండ బాబుతో మాట్లాడి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా యాసిన్ 'సాక్షి'తో మాట్లాడుతూ మంగళవారం సెలవు కొనసాగించాలా..? రద్దు చేయాలా..? ఆలోచిస్తామన్నారు. ఇప్పటికే సీతమ్మధార, కంచరపాలెం రైతుబజార్‌లు పరిశీలించినట్లు తెలిపారు. వారితో పాటు సహాయకుడు సతీష్ ఉన్నారు.

రైతుబజారులో సంతకాలు సేకరణ

సీతమ్మధార, కంచరపాలెం, నరసింహనగర్ (అక్కయ్యపాలెం) రైతుబజార్లలో మంగళవారం సెలవు కావాలని రైతులు సంతకాల సేకరణ చేపట్టారు. సీతమ్మధారలో 200 మంది మంగళవారం సెలవు కావాలని సంతకాలు చేశారు. సెలవు వద్దని 13 మంది కోరారు. నరసింహనగర్ (అక్కయ్యపాలెం)లో 130 మంది సెలవు కావాలని, సెలవు రద్దు చేయాలని పది మంది సంతకాలు చేశారు. కంచరపాలెం రైతుబజార్‌లో 120 మంది సెలవు కావాలని, పది మంది వద్దని సంతకాలు చేశారు.

రాంగ్ పార్కింగ్ చేస్తే చర్యలు



రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ చేసిన వాహనదారులకు జరిమానా విధిస్తున్న ఎస్ఐ మమత

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ స్థలంలో కాకుండా రాంగ్ పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మమత హెచ్చరించారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో వాహనాలను రాంగ్ పార్కింగ్ చేసిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వారు ఎవరి నైనా దింపేందుకు వస్తే వెంటనే వెళ్లిపోవాలని సూచించారు. ప్రయాణికుల కోసం వచ్చే వారు అడ్డంగా వాహనాలు నిలిపి గంటల కొద్దీ వేచి ఉండరాదన్నారు. ఇలా వాహనాలు నిలిపిన వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. గంటల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చినపుడు పార్కింగ్‌లో వాహనాలు పెట్టుకోవాలన్నారు.

కల్తీ నూనె విక్రయాలపై దాడులు



తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావు

బీచ్‌రోడ్డు: కల్తీ ఆయిల్ అమ్మకాలు జరుపుతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారి జి.వి అప్పారావు దాడులు నిర్వహించారు. పూర్ణమార్కెట్‌లోని శ్రీ విజయ లక్ష్మీ ట్రేడ్స్, బాలాజీ ట్రేడ్స్ షాపులపై దాడులు నిర్వహించారు. పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు.

సీఎం సహాయ నిధికి ఏయూ రిటైర్డ్ టీచర్స్ విరాళం



రిజిస్ట్రార్ ధనుంజయరావుకు చెక్కు అందజేస్తున్న ఏయూ రిటైర్డ్ టీచర్లు

విశాఖ సిటీ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్ర విశ్వవిద్యాలయం రిటైర్డ్ టీచర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు సీఎం సహాయ నిధికి రూ.1,01,116 విరాళం అందించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావును కలిసి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎల్.డి.సుధాకర్‌బాబు, ఆచార్య కైలాసరెడ్డి, ఆచార్య జి.వి.వి.జయకుమార్, సునీత తదితరులు పాల్గొన్నారు.

4 గంటలు ఆలస్యంగా వందేభారత్

తాటిచెట్లపాలెం: విశాఖలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–సికింద్రాబాద్ (20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరింది. ఈ రైలు అటునుంచి 4 గంటలు ఆలస్యంగా వచ్చిందని రైల్వే అధికారులు తెలిపారు.

విశేషంగా అన్నసమారాధనలు



కాకరలోవలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



చింతలలోవలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కలిదిండి బద్రీనాథ్

సింథియా: వినాయక ఉత్సవాల్లో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం పలు మండపాల వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ఉత్సవ కమిటీలు అనవసర ఖర్చులు చేయకుండా పేదల కడుపు నింపే అన్నసమారాధనలు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు నాయకులు వారాది పాపారావు, వారాది కోటేశ్వరరావు, శంకర్, భాను, నర్సింగ్, నిర్మల్, అనిల్, పవన్, తిరుపతి, సర్వేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణనాథ యంగ్‌యూత్ ఆధ్వర్యంలో..

63వ వార్డు పరిధి చింతల్లోవలో గణనాథ యంగ్‌యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌టీయూసీ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమా వల్ల ప్రశాంతత లభిస్తుందన్నారు. యువత ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాధుల సురేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుడి సస్పెన్షన్ ఎత్తివేయాలి



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద నినాదాలు చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు శంకరరావు తదితరులు

మల్కాపురం: వాల్తేర్ డిపోకు చెందిన ఆర్టీసీ కార్మికుడు రామారావును అన్యాయంగా సస్పెండ్ చేశారని, తక్షణమే ఆ సస్పెన్షన్ ఎత్తి వేయాలని గాజువాక ఆర్టీసీ డిపో ఎన్‌ఎంయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ నాయకులు,కార్యకర్తలు మంగళవారం మధ్యాహ్నం భోజనం విరామం సమయంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వాల్తేర్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రామారావును క్లర్క్‌గా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. దీన్ని వ్యతిరేకించిన పాపానికి ఆయన్ను వాల్తేర్ డిపో యాజమాన్యం అన్యాయంగా సస్పెండ్ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలపై ప్రశ్నించే హక్కు లేదా అని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి జి.రామారావు,జోనల్ వైస్ ప్రెసిడెంట్ బి.ఎం.రావు, డివిజనల్ ప్రెసిడెంట్ వి.ఎస్.ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



పూజలు చేస్తున్న నాయకులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు విశ్వకర్మ జయంతి వేడుకలను ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దేవర అప్పలరాజు విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేసి కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు, సమస్యలను పరిష్కరించే న్యాయపోరాటంలో విజయం సాధించాలని విశ్వకర్మను ప్రార్థించినట్టు చెప్పారు. కార్మికులు నిత్యం విశ్వకర్మకు పూజచేయడం వల్ల కార్మికులకు హాని కలగకుండా ఉండడమే కాకుండా పరిశ్రమలు కూడా లాభాలతో నడుస్తాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోన అప్పలరాజు, ఉరుకూటి శ్రీనివాస్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విశ్వాన్ని మలిచిన సృష్టికర్త విశ్వకర్మ

మల్కాపురం : విశ్వాన్ని మలిచిన సృష్టికర్తగా విశ్వకర్మ అని ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పంచదార్ల అప్పలరాజుయాదవ్ అన్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం వద్ద విశ్వకర్మ బాబా పూజలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యాలయం వద్ద విశ్వకర్మ బాబా చిత్రపటాన్ని నెలకొల్పి వివిధ పరికరాలను ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజుయాదవ్ కార్మికులకు స్వీట్స్, బహుమతులను అందించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మల్కాపురం బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. 59వ వార్డు శాంతిగిరి కాలనీ వద్ద బీజేపీ నగర నాయకులు పోలిమేర శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మోడీ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

రైతు బజారులో స్వచ్ఛతా హీ సేవా

పాల్గొన్న ఎయిర్‌పోర్టు , సీఐఎస్ ఎఫ్ సిబ్బంది



మర్రిపాలెం రైతు బజారు పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎయిర్ పోర్టు సిబ్బంది, సీఐఎస్ఎఫ్ జవాన్లు

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం సిబ్బంది, సీఐఎస్ఎఫ్ జవాన్లు సంయుక్తంగా మంగళవారం మర్రిపాలెం రైతు బజారులో స్వచ్ఛతా హీసేవ కార్యక్రమం నిర్వహించారు. రైతు బజారులో పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్రాంతాన్ని చీపుర్లతో శుభ్రం చేశారు. వచ్చిన చెత్తను డంపర్ బిన్లలో వేశారు. భారత ప్రభుత్వం ప్రతిపాదించిన స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. తొలుత ఎయిర్ పోర్టులో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామని, ప్రతీ ఒక్కరికి పరిశుభ్రత గురించి వివరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

వాల్తేర్ డివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవా ప్రారంభం



అధికారులు, సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల స్టేషన్లు, రైల్వే కాలనీలు, ప్రాంగణాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు, డీఆర్‌ఎం కార్యాలయం వద్ద స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు (ఆపరేషన్స్), సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), సీనియర్ డివిజినల్ మెకానికల్ ఇంజినీర్, ఎన్విరాన్‌మెంట్ హెడ్ ప్రవీణ్‌భట్, డివిజినల్ మెకానికల్ ఇంజినీర్ నరేంద్రకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పల్గొన్నారు.